## దేవతార్చన

మైదానాలూ, ప్రభూ, మానస నిశ్శబ్దాలు, కడతేరిన వరండాలు, స్తంభాలు, మేము నడచిన స్థలాలు, మేము చూచిన ముఖాలు, చిన్నపిల్లల పాటలు. కాని అన్నింటి కన్నా మిన్నగా—రహస్య లిపులు, పావిత్ర్యం, రాతిలో మలచిన ప్రతిమ, సులభ రేఖ, మా భాష, ఆకులపీ కలలపీ చిరునవ్వు విరుపులు, స్వరం కూర్చిన వంపులు, చేతి విసురు, కర చరణాల స్పర్శ, విశ్వగోళాల ప్రేమ, మృత్యువంటే నిర్భీతి, కొంచెం కాంక్ష. ఔను మరి. వెలుతురు, మా సూర్యుడు, ప్రభూ, మరిచిపోయిన మనుష్యుల సూర్యుడు, సర్వత్రా మహానుభావులూ మరుగుజ్జులూ మెసలే కాలంలో కలిసిపోయిన ప్రభావాలు, Bach అనే మనిషి, Cezanne అనే మనిషి, ఇంకా ఎందరో పేర్లులేనివాళ్ళు, ఇప్పుడిప్పు దేకీభవిస్తూన్న ఎందరెందరో అనామకులు, మావదనం, అనామధేయ జనానీకాల హాహాకారాలు, మా ఆకృతి, ఒడ్డూపొడుగూ, వెలుతురులో నడిచే మనుష్యులు, వివిధ ప్రదేశాలలో, ఆసియాతో ప్రారంభించి, యూరప్, ఆఫ్రికా, తర్వాత మనస్సూ, వయస్సూ ద్రవీభవించిన సముద్రం అట్లాంటిక్, దీనికవతల పడమటగా ఈ దేశం అమెరికా నావికదళాల విన్యాసాలు, విల్సన్ వికటహాసం, లిథువేనియాకు స్వాతంత్ర్యం, పోలెండుకు జై, టెక్సాస్ మాగాణాలు, తియ్య దుంపలు, దారిద్ర్యం మా కృతజ్ఞత ప్రభూ. మరి అంకెలకి, మా దుఃఖాన్ని దొంతర పెట్టడానికి, ఒకటీ ఏడుపు. రెండూ నొప్పి, మూడూ పిచ్చి, ఇంకా ఒక వెయ్యి, ఇంకో పదివేలు, కాలాన్ని కొలవడం, కాంతి సంవత్సరాలు మాట వరసకి డార్విన్ గడ్డం, అనుకుందాం. ఐన్‌స్టైన్ కళ్ళు, ప్రశస్తికెక్కిన పోలిష్ పియానో విద్వాంసుని వేళ్ళు, అన్నీ అంకెలతోనే లెక్కిద్దాం. ఫోర్డుమెల్లాన్ దొరల ఐశ్వర్యం, ఎవరి దారిద్ర్యం—తగిన పేరు ఆలోచించాలి—అందాం ఫౌండ్ దారిద్ర్యం లేదా అనుకుందాం నా దారిద్ర్యమే, ఎవరూ ఎరగని నేను, ఏ పేరూలేని కుర్రాడు, ఒంటరిగా కూర్చుని దేవునికోసం, పత్రికల కోసం కథలు రాసుకునే ఈ యువక రచయిత అంటే దాని తాత్పర్యం, ఆ పేరులేని బీభత్సం, అందులోని ఏకాంతం, యశస్సుకై

తపస్సు. ఆఖరి కొాక చిన్న కాగితం ముక్క. అంగీకారం. ఏయ్ (నాపేరు) ఓయ్ అబ్బాయ్. నువ్వు సుప్రసిద్ధుడివైనావ్. పత్రికలో పడింది కథ. కృతజ్ఞుణ్ని ప్రభూ.

మూలం: William Saroyan

నూరేళ్ళ క్రిందట ఎడ్గార్ పో, యాభైయేళ్ళ కిందట ఓ హెన్రీ, ఇవాళ విల్లియం సారోయాన్ అమెరికాలో నం. 1 కథారచయితలు. ఈనాటి కథకు అందరిలో ఒక ప్రత్యేకమైన బాణీ ఉన్న సారోయాన్ టెక్నిక్‌కి అతని అన్ని కథలూ ఉదాహరణలే. అతనిది వినూత్నమైన శైలి. విలక్షణమైన దృక్పథం. విచిత్రమైన కంఠధ్వని. అతని మొట్టమొదటి కథా సంపుటిలో 'Common Prayer' అనే రచనకు ఇది నా తర్జుమా.